క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూ పోలీస్ స్టేషన్, పలివేల్పుల, సీఆర్‌ఎఫ్ క్యాంప్, టీబీ ఆస్పత్రి, కనకయ్య హోటల్, మహాత్మా నగర్, విజయ గణపతికాలనీ, వినాయక టెంపుల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, న్యూ శాయంపేట, గొల్ల వాడ, శాయంపేట మెయిన్‌రోడ్డు, యాదవనగర్, అల్లూరి ఇన్‌స్టిట్యూట్, టెంపుల్ ట్రీ విల్లా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు ప్రపంచ ధ్యాన దినోత్సవం

నయీంనగర్: డిసెంబర్ 21న అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా వరంగల్ పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్ నుంచి జూ పార్కు మీదుగా రామకృష్ణ ధ్యాన మందిరం వరకు ధ్యాన సాధకులు పిరమిడ్ మాస్టర్లతో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు శనివారం పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఎస్‌ఎస్‌ఎం బాధ్యులు యాకూబ్ నాయక్, అంజలిదేవి, రమాదేవి పాల్గొన్నారు.

22న అంతర్జాల సమావేశం

హన్మకొండ కల్చరల్: ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అంబేడ్కర్ ఆలోచనల తాత్వికతపై అంతర్జాల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక అధ్యక్షురాలు అనిశెట్టి రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు చుట్టం.. ఆర్‌ఓఆర్ చట్టం

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఆర్‌ఓఆర్ –2024 చటం రైతులకు చుట్టం వంటిదని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. తెలంగాణ భూ భారతితో రైతులకు న్యాయం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందుతాయని, చట్టబద్ధ హక్కుల నమోదు, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సాదా బైనామాల క్రమబద్ధీకరణ జరుగుతుందని, మ్యుటేషన్ పకడ్బందీగా ఉంటుందని వివరించారు.

నిట్ ప్రొఫెసర్‌కు రామానుజన్ పురస్కారం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసచార్య.. ఎస్‌ఆర్‌ఎఫ్ (శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్) రామానుజన్ గణిత పురస్కార్ –24కు ఎంపికైనట్లు ఎస్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ గురువారం తెలిపారు. నిట్‌లోని మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో శ్రీనివాసచార్యకు ఎస్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అమరేష్, నిట్ ప్రొఫెసర్ ఉమామహేశ్వర్‌రావు ఎంపిక పత్రాన్ని అందజేశారు.

రాష్ట్ర స్థాయి పరీక్షకు విద్యార్థిని ఎంపిక

ఖిలా వరంగల్: వరంగల్‌లో తెలంగాణ బయాలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష పోటీల్లో ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సమీరా.. ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈనెల 28న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు ఎంపికైంది. ఈమేరకు పాఠశాల ఆవరణలో సమీరాను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శైలేంద్రకుమార్ గురువారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, భాస్కర్, కిరణ్, యాకుబ్‌పాషా, వెంకట్ రెడ్డి, కుమారస్వామి, సత్తార్ పాల్గొన్నారు.

కన్స్యూమర్స్ రైట్స్ నేషనల్ వైస్ చైర్‌పర్సన్‌గా అనితారెడ్డి



హన్మకొండ: వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్‌పర్సన్‌గా, అడ్వైజర్‌గా డాక్టర్ కరుకాల అనితారెడ్డిని నియమించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ రామానుజస్వామి తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరోపణలను ఖండిస్తున్నాం

ఖిలా వరంగల్: పార్టీలో ఉంటూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా వ్యవహరించిన ముక్కెర రామస్వామి, మాలోతు సాగర్‌ను పార్టీ నుంచి బహిష్కరించామని, వారు పార్టీపై అనేక తప్పుడు ఆరోపణలు చేయడంపై సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి అవినీతి, అక్రమాలపై పార్టీ రాష్ట్ర కమిటీ ముగ్గురు సభ్యులతో కూడిన కమిషన్ వేసి పదినెలల పాటు లోతైన విచారణ జరిపిందన్నారు. ఈ విచారణలో అవినీతి, ఆరోపణలు నిజమేనని తేలిందని పేర్కొన్నారు. ఈక్రమంలో వారికి పార్టీ నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరిన తర్వాతే వారిని పార్టీ బహిష్కరించినట్లు వివరించారు.

శిథిలావస్థలో కాకతీయ పైలాన్

- కళావిహీనంగా దర్శనం
- పట్టించుకోని అధికారులు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ – వడ్డేపల్లి రిజర్వాయర్ కట్టపై పుష్కర కాలం క్రితం ఆవిష్కరించిన కాకతీయ పైలాన్ శిథిలావస్థకు చేరింది. పర్యాటకులను ఆకర్షించడం కోసం సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో కట్టను అభివృద్ధి చేసి అందంగా తీర్చిదిద్దారు. ఈ క్రమంలో మున్సిపల్, కుడా అధికారులు 2012లో అప్పటి కేంద్రమంత్రి బలరాంనాయక్ చేతుల మీదుగా ఓ పైలాన్‌ను ఆవిష్కరించారు. దానిపై కంచుతో తయారు చేసిన కాకతీయ రాజుల బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇప్పుడది శిథిలావస్థకు చేరుకుని కళా విహీనంగా మారింది. పైలాన్ చుట్టూ అమర్చిన బొమ్మలు ఒక్కొక్కటిగా ఊడిపోతున్నాయి. గద్దె చుట్టూ ఏర్పాటు చేసిన గ్రానైట్ రాయి పూర్తిగా ధ్వంసం అయింది. నిత్యం ఆహ్లాదం కోసం వడ్డేపల్లి కట్టపైకి వచ్చే పర్యాటకులను శిథిలంగా మారిన పైలాన్ వెక్కిరిస్తోంది. అధికారులు స్పందించి పైలాన్‌కు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.



వడ్డేపల్లి కట్టపై శిథిలావస్థకు చేరిన పైలాన్



గ్రానైట్ రాయి ఊడిపోయిన పైలాన్ గద్దె



ధ్వంసమైన గద్దె



ఊడిపోయిన బొమ్మలు

భవన నిర్మాణ పనులు నిలిపివేయాలి

- బల్దియా కమిషనర్‌కు బీజేపీ, ప్రజా, కార్మిక సంఘాల వినతులు

వరంగల్ అర్బన్: వరంగల్ ఓసిటీ సమీపంలోని ఆజంజాహి మిల్లు యూనియన్ భవన్ స్థలంలో కొత్తగా భవన నిర్మాణ పనులు చేపట్టకుండా నిలిపివేయాలని బీజేపీ వరంగల్ జిల్లా కమిటీ, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను గురువారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన స్థలంలో 1959, నవంబరు 3న ఆజంజాహి మిల్లు వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణం కోసం అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. వరంగల్‌కు చెందిన ఓ బడా వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ కోసం అధికారులు అనుమతి ఇవ్వడం సరికాదని ఆక్షేపించారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, బాకం హరిశంకర్, కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, చాడ స్వాతి, రావుల కోమల, బైరి లక్ష్మి, జలగం అనిత, మునిగాల సరోజన, గందె కల్పన, గుజ్జుల వసంత, కార్మిక ప్రజాసంఘాల నాయకులు సింగారపు బాబు, నలిగంటి రత్నమాల, పనాస ప్రసాద్, జగదీశ్వర్, సుమన్, కోటేశ్వర్, రమాదేవి, గంగుల దయాకర్, శ్రీనివాస్, నగేష్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మార్కెట్‌లో తూకాలపై అవగాహన



తూకాలపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

వరంగల్: వినియోగదారుల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో రెండో రోజు గురువారం మార్కెట్‌లోని రైతులు, అధికారులకు లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011 – సవరణలపై అవగాహన కల్పించినట్లు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. తూనికలు, కొలతలపై తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ స్టాంపింగ్ ఉండాలని అన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పీఓఎస్ మిషన్లతో పాటు మిరప, పత్తి తూకాల్లో లీగల్ మెట్రాలజీ ఆమోదం ఉన్న మాయిశ్చరైజర్ మిషన్లు తప్పనిసరిగా ఉండాలని మార్కెట్ అధికారులకు మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి సూచించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ గ్రేడ్ –2 కార్యదర్శి డి.అంజిత్‌రావు, హైకోర్టు అడ్వకేట్ మురారి యశ్వంత్ కుమార్, మండలి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రావుల రంజిత్ కుమార్, చిలువేరు ప్రవీణ్, అసిస్టెంట్ సెక్రటరీ రాజేందర్, సూపర్‌వైజర్లు జి.గంగాధర్, మురళి పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ అధికారులతో కలిసి తూకం యంత్రాలను వినియోగదారుల మండలి ప్రతినిధులు పరిశీలించారు. కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) పోస్టర్‌ను విడుదల చేశారు.

కాజీపేటలో అగ్ని ప్రమాదాలపై ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో హనుమకొండ అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిమాపక ప్రదర్శన గురువారం జరిగింది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎల్.దయాకర్, రైల్వే సీనియర్ డీఎంఈ ఎస్‌వీ.వెంకటకుమార్ పర్యవేక్షణలో ప్రదర్శనలు జరిగాయి. ఇంట్లో గ్యాస్ సిలిండర్ వాడకంపై జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గృహ విద్యుత్ పరికరాల ఫైర్ యాక్సిడెంట్ల గురించి వివరించి వాటి నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఎంఈ అనికేత్ ఖడ్గే, ఏడీఎంఈ భానుప్రకాష్, జనరల్ ఎస్‌ఎస్‌ఈ శ్రీనివాస్‌నాయక్, ఎల్‌ఎఫ్ రాజశేఖర్, ఈఎఫ్ రమేష్‌కుమార్, ఫైర్ స్టాఫ్ ఎండీ.యాకూబ్, గౌతమ్ ముని, డి.రాజాకుమార్, జి.వంశీ, ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రామారావు, ఆల్ ఇంజినీర్స్, కార్మికులు, కాంట్రాక్ట్ వర్కర్లు పాల్గొన్నారు.

సీనియర్లను విస్మరించడం సరికాదు



ఖిలా వరంగల్: 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నానని, తన లాంటి సీనియర్లను పార్టీ విస్మరించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కరాటే ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు నివసించే భూపేష్‌నగర్‌కు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇచ్చి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్ రోడ్డు భూపేష్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్లకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీలో స్థానం కల్పించకపోవడం బాధాకరమని వాపోయారు. అజీర, అరుణ, అంజమ్మ, సంతోషిని, స్వరూప, కొయ్యాడ ఉమ, రమ, మస్తాన్, వెంకట్, రమేష్, రాజేశ్వర్, ఆడెపు రాజేందర్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఎస్సై

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పరకాల డివిజన్ శాయంపేట పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్వర్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి మొక్క అందజేశారు.

ఏసు మార్గంలో మానవాళికి రక్షణ



కేక్‌కట్ చేస్తున్న వినయ్‌భాస్కర్

కాజీపేట రూరల్: ఏసుక్రీస్తు మార్గంలో ప్రపంచ మానవాళికి రక్షణ సమాధానం, ప్రేమ, సంతోషమని, క్రీస్తు చెప్పిన మాటలు నేనే జీవం, నేనే మార్గం, నేనే సత్యమనే మాటలు ఎంతో స్ఫూర్తిదాయకమని బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట బాపూజీనగర్ మెయిన్‌రోడ్డులోని సిద్దు టెంట్‌హౌస్ వద్ద బీఆర్‌ఎస్ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నార్లగిరి రమేష్, శిరుమల్ల దశరథం, గబ్బెట కరణ్, దువ్వ కనకరాజ్, పాలడుగుల శివకుమార్, సుంచు కృష్ణ, కాటపురం రాజు, పాలడుగుల రామస్వామి, సుంచు అశోక్, ఎండీ.హుస్సేన్, దువ్వ నరేష్, బొల్లికొండ యాదగిరి, సోని, మహమూద్, ఇమ్మడి రవి, సిరిపాక కుమార్, నయీంజుబేర్, చందర్ పాల్గొన్నారు.

భగవద్గీత సారం.. నిత్యం ఆచరణీయం

వరంగల్: భగవద్గీత శ్లోక పఠనం కుల, మత భేదాలు లేకుండా ప్రతిఒక్కరూ ప్రతినిత్యం పాటించాలని, దాని సారాంశాన్ని జీవన విధానంలో ఆచరించేలా మనస్ఫూర్తిగా ప్రయత్నించాలని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. కందుకూరి శివానందమూర్తి 96వ జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం జిల్లా స్థాయి భగవద్గీత పోటీలను సప్తధామంలో నిర్వహించారు. పోటీల్లో 100 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు ప్రథమ బహుమతి రూ.5116లు, ద్వితీయ బహుమతి రూ.3116లు, తృతీయ బహుమతి రూ.1116 నగదు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పెద్ద ప్రభాకర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ పంపిణీ

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో ఆల్ ఇన్ వన్ బుక్స్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జనగామ కోఆర్డినేటర్ హరికిషన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించాలని సూచించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హసన్‌పర్తి అధ్యక్షుడు కృపాకర్, కార్యదర్శి ఎస్.కుమారస్వామి, కోశాధికారి శేఖర్, సభ్యులు సంపత్, సుధీర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరంగల్ శివనగర్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సిస్సినాటి మిత్ర బృందం ప్రతినిధులు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పూస నరేంద్రస్వామి, తిరుపతి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రంగాచారి, కవిత, అంజయ్య, సుజాత, ధనలక్ష్మి, సుహాసిని పాల్గొన్నారు.



హసన్‌పర్తి: బుక్స్ పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

ఎస్‌వీఎస్‌లో మహిళా క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎర్రబెల్లి సువర్ణ

హసన్‌పర్తి: నగరంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో మహిళా క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్‌వీఎస్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ మాట్లాడుతూ విద్యార్థినులు క్రికెట్ ఆడడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం చేకూరుతుందన్నారు. చదువుకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉపాధి, ఉద్యోగాల్లో క్రీడాకారులకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

వరంగల్: సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా 3వ డివిజన్ పైడిపల్లిలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలను స్థానిక కార్పొరేటర్ జన్ను షీభారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు జన్ను అనిల్ కుమార్, జిల్లా క్రీడల అధికారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ షీభారాణి

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కోర్టు ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్న హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ లీగల్ సెల్ సభ్యులు, న్యాయవాదులు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై నగరవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు, దళిత సంఘాల నాయకులు గురువారం నిరసన తెలిపారు. మంత్రి అమిత్‌షాను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిల్లా కోర్టు ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ న్యాయవాదులు ఆందోళన చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తంగా

మార్కెట్‌లో కొనుగోళ్లకు అంతరాయం

వరంగల్: రాష్ట్ర మార్కెటింగ్ శాఖలోని సర్వర్ డౌన్ కావడంతో ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోళ్లకు గంట సేపు అంతరాయం కలిగింది. సర్వర్ డౌన్ వల్ల పీఓఎస్ మిషన్లతో జారీ చేసే లాట్ ఐడీలను రైతులకు మార్కెట్ సిబ్బంది జారీ చేయలేకపోయారు. అనంతరం సర్వర్ సేవలు అందుబాటులోకి రావడంతో రైతులకు లాట్ ఐడీలను జారీ చేసినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు



కాజీపేట: కాజీపేట పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో బిహార్ రాష్ట్రానికి చెందిన సోహెల్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. సోమిడి రోడ్డు విస్తరణలో భాగంగా కొద్దిరోజులుగా విద్యుత్ స్తంభాలను పక్కకు జరిపి కొత్తవి బిగిస్తున్నారు. ఈక్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ప్రత్యేక గద్దెపై ఏర్పాటు చేశారు. పనులు పూర్తయినట్లు కార్మికులు చెప్పడంతో విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు. ఆ సమయంలో చైన్‌ను తీయడానికి సోహెల్ ప్రయత్నించగా కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడి కాళ్లు, చేతులు కాలిపోయాయి. వెంటనే కూలీలు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి

ఖిలా వరంగల్: జీఓ నంబర్ 58 ప్రకారం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ మండలం అంబేడ్కర్ నగర్‌లో ఓర్సు రాజు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, పేదల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో పంజాల రమేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, దండు లక్ష్మణ్, జాన్‌పాల్, సౌందర్య, సువర్ణ, శరత్ రమేష్ బాబు, ఆరోగ్య కుమార్, ప్రభాకర్, కరుణాకర్ పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

కాజీపేట రూరల్: జీసస్ ప్రేయర్ హౌజ్ ఆధ్వర్యంలో పేదలకు కాజీపేట జంక్షన్‌లో గురువారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీసస్ ప్రేయర్ హౌజ్ వ్యవస్థాపకుడు పాస్టర్ మరియదాస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ మాసాన్ని పురస్కరించుకొని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పలువురికి భోజనం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్, కాంగ్రెస్ నాయకుడు బట్టు సమోదర్, పాస్టర్ హోషయా, పాల్, కోర్నెల్, స్టాలిన్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి స్వెట్టర్ల అందజేత

హన్మకొండ: శీతాకాలంలో చలి తీవ్రతను తట్టుకునేందుకు మున్సిపల్ సిబ్బందికి స్వెట్టర్లు పంపిణీ చేసినట్లు 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి తెలిపారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలోని తన స్వగృహంలో మున్సిపల్ సిబ్బందికి స్వరూపరాణి గురువారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్ రెడ్డి, జవాన్లు ఇమ్మడి సాగర్, పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో గణపతి హోమం

కాజీపేట: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులు గురువారం గణపతి హోమం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయుడికి వివిధ రకాల పూలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మామునూరు: ఎంబీఏ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని వాగ్దేవి కళాశాల ఎంబీఏ విభాగం అధిపతులు శివశంకర్, డాక్టర్ వై.భాస్కర్‌రావు సూచించారు. ఈమేరకు వరంగల్ బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎస్సెన్షియల్ ఆఫ్ కార్పొరేట్ స్కిల్స్ అనే అంశంపై ఎంబీఏ విద్యార్థులకు మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో శ్రీకుమార్, సుశ్రిత, మాధవి, దేవేందర్ రెడ్డి, వాణి, సరిత, జయ రామకృష్ణ ముక్తీశ్వర్, శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

విద్యారణ్యపురి: విద్యాశాఖలో తమను విలీనం చేయాలని, మినిమం పేస్కేల్ వర్తింపజేయాలని సమగ్రశిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన నిరసన దీక్షలు గురువారం పదో రోజుకు చేరాయి. శిబిరాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అలాగే, వరంగల్ జిల్లాలోని పలు మండలాల ఎంఈఓలు రత్నమాల, అశోక్, వెంకటేశ్వర్లు, సారయ్య, ప్రసాద్, లింగారెడ్డి, శ్రీధర్, రాము సంఘీభావం తెలిపారు. శిబిరంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికల శ్రీధర్‌గౌడ్, బాధ్యులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

వరంగల్: వరంగల్ ఇందిరమ్మ కాలనీలోని కిరాణం షాపులోని మహిళపై కారం చల్లి మెడలోని పుస్తెలతాడును లాక్కుని పారిపోయిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. గురువారం ఏనుమాముల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హుకుంసింగ్‌ను అదుపులోకి తీసుకుని దొంగిలించిన రెండున్నర తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసిన సీఐ రాఘవేందర్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అదుపులో గుట్కాల విక్రయదారులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో గుట్కా ప్యాకెట్లను రహస్యంగా విక్రయిస్తున్న వ్యాపార సంస్థలపై ఆకస్మిక దాడులు చేసి రూ.5వేల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎస్సై నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సోదాలు చేసినట్లు చెప్పారు. రంగు ప్రేమ్‌సాగర్, దబ్బెటి నారాయణ, బైరబోయిన సదానందం, గొట్టిముక్కుల నటరాజ్, ఎండీ.అఫ్జల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

మాలల ముందస్తు అరెస్ట్, విడుదల

మడికొండ: చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాలలను మడికొండ పోలీసులు ముందస్తుగా గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో మడికొండకు చెందిన కాశీశ్వరపు రాజేందర్, వెన్నమల్ల రమేష్, జవ్వాజి కిషన్, తరాలపల్లి గ్రామానికి చెందిన దాసరి మల్లేశం, అంకేశ్వరపు వెంకటస్వామి, బుంగ రవి, భట్టుపల్లికి చెందిన మగ్గిడి కనకరాజు ఉన్నారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.